# లవ్ స్టోరి

## ఇదీ ప్రేమేగా!

ఏమీ తోచక బజార్లో నడుస్తుంటే 'విజయదుర్గ'లో 'ప్రేమ పావురాలు' అని కనపడగానే థియేటర్‌లో దూరాను. సీట్లో కూర్చున్న రెండు నిమిషాలకి ఇద్దరమ్మాయిలు నా వైపుగా రాసాగారు. ఒకమ్మాయి నన్ను దాటుకుని వెళ్ళగానే వెనకాలే మరో అమ్మాయి వెళ్తుండగా అనుకోకుండానే ఆమె వేళ్ళు నా తలను స్పృశించాయి. "అయ్యో! సారీ అండీ!" అంది బాధగా. "ఏం ఫర్లేదు" అనేశాను.

వెళ్ళి నాలుగు సీట్ల అవతల కూర్చుంది. సర్దుకుంటూ ఆ అమ్మాయిని చూశాను. తలవంచుకుని పక్క అమ్మాయితో ఏదో చెప్తూ మధ్య మధ్య సన్నగా నవ్వుతున్నది. ఆమె కదలికలకి పచ్చటి మోములో ఎంత అందాలు, తమాషాగా విచ్చుకున్న పెదవుల మధ్య పలువరుస కాంతులు, సన్నటి వేళ్ళ కదలికలు, నవ్వుతున్నట్లున్న కాటుక కళ్ళు... నన్నెంతో ఆకర్షించాయి. నాకు తెలియకుండానే నా జీవితంలో నేను మొదటిసారిగా ఒక అమ్మాయి గురించి చాలాసేపు ఆలోచించాను. మరి దీన్ని ఏమంటారో నాకు తెలీదు. మీకేమైనా తెలుసా?

* * *

డాబా మీదకు వెళ్ళి చల్లగాలికి తిరుగుతున్నా. అప్రయత్నంగా క్రిందకు చూశాను. స్నఫ్ కలర్ పంజాబీ డ్రెస్‌లో... ఆ అమ్మాయే! పక్క పోర్షన్‌లోకి వెళ్తున్నది. ఇందాకే అమ్మ అంది — "క్రొత్తవాళ్ళెవరో ఆ ఇంట్లోకి వచ్చారని. చాలా బాగా మాట్లాడుతారని."

రాత్రికి టి.వి.లో వార్తలు చూశాక 7-50కి అన్నం తినేసి డాబా మీద పక్క వేశాను. పక్క డాబాలో లైట్ వెలిగింది — నా గుండెలో కూడా. నాలో నాకే అర్థం కాని భావోద్వేగం. అంత చల్లగాలిలో కూడా చెమటలు. కంగారుగా మొహం తుడుచుకుంటుంటే నా ఊపిరి నాకే వెచ్చగా తగుల్తూ వుంది. ఖచ్చితంగా పది సెకన్ల తరవాత ఆమె పుస్తకాలతో, చాపతో పైకి వచ్చింది. వెలుతురు బాగా పడేచోట చాప పరుచుకుని కూర్చుంది చదువుకుంటూ. గులాబీరంగు నైటీలో ముద్దొస్తోంది. అలాగే చూస్తూ కూర్చున్నాను. దాదాపు పదింటి వరకు చదువుకుంటూ కూర్చుంది. చాప మీదే కూర్చోవాలా? ఒప్పుకుంటే నా గుండెలో ప్రతిష్టించుకోనూ...! అలా రోజూ ఆమెని వెలుతురులో చూస్తూ నేను చీకట్లో కూర్చోవడం నాకు ఇష్టమైన పని. మరి దీన్నేమంటారో నాకు తెలియదు. మీకు తెలుసా?

* * *

ఉదయం ఏడు అయింది. అది ఆమె కాలేజీకి వెళ్ళే టైమ్. రోజూలాగే చేతిలో గులాబీతో పంచలో కూర్చున్నాను. అది ఇవ్వాలనుకుంటాను. కానీ నాకా ధైర్యం లేదు. ఎప్పుడు వస్తుందో నాకా ధైర్యం! అదిగో వస్తున్నది. ధైర్యం కాదు, ఆ అమ్మాయి. దించిన తల ఎత్తరాదూ! ఏమిటో...! ఎంత ఆపుతున్నా ఆగక గాలికి ఎగురుతున్న నీలిరంగు ఓణీలో అద్భుతంగా వుంది. నదురుగా అల్లుకున్న బారెడు జడలో కనకాంబరాలు నన్ను చూసి నవ్వాయి. పల్చటి కనుబొమల క్రింద వున్న అందమైన కాటుక కళ్ళని ఎత్తి ఒక్కసారి నా మీదకు ఒక్క చూపు విసిరేసి వెళ్ళిపోతుంటే... నా గుండెని తొక్కి వెళ్తున్నట్లనిపించింది. దీన్ని ఏమంటారో నాకు తెలిసింది. ఇదేగా 'ప్రేమ'. మీ కంటే నాకే ముందు తెలుసు.

* * *

నా ఆరాధనకు అప్పుడే అరవై రోజుల వయసొచ్చింది. నేను గమనించనే లేదు. అయినా ఇంత ఆలస్యంగా నేనామెని ప్రేమిస్తున్నానని నాకు తెలియడం బాగాలేదు. వెధవ మనసు. ఇంకొస్త ముందు తెలిసితే ఏంపోయిందో! నాకామె గురించి కొన్ని వివరాలు మాత్రమే తెలిశాయి! పద్దెనిమిదేళ్ళ అందం ఆమెది. తనొక్కర్తే అమ్మాయి. కానీ ఆ అమ్మాయి పేరేంటో కూడా తెలుసుకోలేకపోయాను. అమ్మకి బాగా పరిచయమైందామ్మాయి. అమ్మనడగాలంటే... ఊహూ... నాకు ఇష్టం లేదు. ఆమెకు చెప్పెయ్యాలి నా మనసు. గట్టిగా నిర్ణయించేసుకున్నాను.

* * *

మర్నాడు పొద్దున ఆరు గంటలకి డాబాల మీద ఎదురయ్యాం. బట్టలారేస్తూ "నీ జతలేక పిచ్చిది కాదా మనసంతా. ఆ మనసేమో నా మాటే వినదంట. కదిలించేను కరిగించేను నన్నంటూ..." అంటూ ఆపేసింది. సుశీల లాగా పాడుతూంది. ఎంతో తియ్యగా వుంది పాట. "చిత్ర పాడినా మీ రెంతో అద్భుతంగా పాడుతున్నారే - సుశీలలాగా" అన్నాను. తలదించుకుని తన పనేదో చేసుకుంటున్న ఆమె మొహం ఎర్రబడింది మరి - సిగ్గుచేతో... కోపం వల్లో... తెలియదు. గీతాంజలి 'గిరిజ'ని గుర్తుతెచ్చుకుని "ఏయ్! నేను నిన్ను ప్రేమిస్తున్నాను. ఐ లవ్యూ!..." ఇంకా ఏదో అనబోతుంటే ఎర్రగా చూసింది. అమ్మో! మరీ అంత కోపమా! నేను తట్టుకోలేక "సారీ!" అనబోతుంటే "అసలు మీకు నా పేరైనా తెలుసా? ప్రేమిస్తున్నారుట. బుద్ధుందా?" అంది.

నేనూహించని పరిస్థితి. అనవసరంగా చిక్కుకున్నాను.

"అహా! మరి..." నా మాటలు కట్ చేస్తూ "ఇంకేం చెప్పకండి. ఇలాంటి వెధవ ప్రేమలు నా కిష్టం లేదు" అంది.

మరి సినిమా లెందుకు చూస్తుందో! పాట లెందుకు పాడుతుందో!

క్రిందికి వెళ్ళబోతుంటే "పేరు కనుక్కుంటే ప్రేమిస్తారా!" కసిగా అడిగాను.

"పందెం! కనుక్కోలేరు" ఎగతాళిగా అంది. నాలో పట్టుదల. "ఛాలెంజ్" — అన్నాను. "సరే! నాలుగక్షరాలు. ఎవర్నీ అడక్కూడదు. మీ అమ్మగార్ని కూడా అడగకూడదు" అంది నన్ను పరిహాసిస్తున్నట్టు.

"సరే! ఎప్పుడు చెప్పాలి?" అన్నాను.

"మీ ఇష్టం. ఎన్నాళ్ళైనా సరే! ఎందుకంటే

మీరోడిపోతారుగా!''

''ఆహా! అంత నమ్మకమా! సరే! రేపీపాటికి చెప్పేస్తాను.''

''ఆ! చూద్దాం!'' అనేసి వినవిసా వెళ్ళి పోయింది.

నా కొళ్ళు మండింది — కొంచెం. పేపే. నా మాటలు పూర్తిగా వినకుండా వెళ్ళిందని ఉక్రోషం. కసిగా నేలను తన్ని ఇంట్లోకి వచ్చాను. ఆలోచిస్తూ కూర్చున్నాను.

నాలుగక్షరాలు... ఆ! వైజయంతి, విశాలిని, జయప్రద, జయసుధ, జయచిత్ర, భాను ప్రియ, సుహాసిని, సుభాషిణి, కమలిని, రోజారాణి, ఝాన్సీరాణి, శోభారాణి, సుధా రాణి, అనూరాధ... అమ్మో! చాలా వున్నా ఏం చెయ్యను? యండమూరి 'వెన్నెల్లో ఆడపిల్ల' కళ్ళ ముందు నిలిచి పెద్ద గొప్పగా ఛాలెంజ్ చేశాను. ఇంకేదన్నా 'క్లూ' ... బాగుండేది. పౌరుషమొక... నా మొహానికి! నరసు... ఇంతే! అనుభవించాల్సిం... తప్పదు. ఏం చెయ్యాలి... ఆ [illegible] ... జుట్టు పీక్కున్నాను. బయట గడప దగ్గ...



ఎంత ఆలోచించినా... [illegible] గబుక్కున ఆమె ''అమ్మ లేదు [illegible] కలిసి ఊరు వెళ్ళింది'' అన్నాను.

''తెలుసు. గుంటూరేగా! [illegible] చెప్పా రాండి! నాలుగక్షరాలంటే మీరు [illegible] నగుల కొట్టుకుంటున్నారు కాబోలు అనుకున్నాను. మీరు మరీ...'' అంటూ అవుతూ నవ్వు దాచుకోవాలని ప్రయత్నిస్తుంటే... నా కెంత కసిగా వుందో నాకు మాత్రమే తెలుసు.

''సరే! నా పేరులో మూడక్షరాల సినిమా వుంది. నేనిక్కడికి వచ్చానని నా కేదో మీ మీద ఇంట్రెస్ట్ అనుకోకండి'' గడప దగ్గర ఆగి చెప్పేసి వెనుతిరిగింది. నేను పెద్దగా అరిచాను — ''సంధికార్యాలుండవా!'' అని.

''ఉండవు. ఉండకపోవచ్చు. నా పేరు ఒక పేరు పొందిన కవి భార్య పేరు. గెలవడానికి ట్రై చెయ్యండి'' అంది. వెంటనే వెళ్ళి పోయింది.

అలాగే చూస్తూ చాలాసేపుండిపోయాను. ఆమె మాట్లాడుతున్నంతసేపూ ఆమెలోని ఏదో వింత పరిమళం నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది.

*  *  *

ఈ. నిదిలించి ఆలోచనలోంచి బయటపడి తెల్ల కాగితం మీద మూడక్షరాల పేర్లన్నీ రాశాను. దేవకి, శోభన, రజని, అమల, నిర్మల, శాలిని, కోమలి, గిరిజ, అంజన, రాధిక, అంబిక... ఇంకా... ఆ... భాగ్యశ్రీ, నళిని,

(23వ పేజీ తరువాయి

జయంతి... ఇలా ఇరవై పేర్లు వ్రాశాను. తరువాత తెలుగు భాషలోని అక్షరాలన్నీ గుణింతాలతోసహా ఒక్కో పేరుకి కలుపుతూ వచ్చాను.

'మృ' అనే అక్షరంతో చూస్తూ 'నళిని' దగ్గరకి వచ్చాను. 'మృనళిని'. ఏదో పేరులాగా అనిపిస్తున్నది. కొంచెం మార్చాను. 'మృనాళిని'... అవును. "మృణాళిని". అర్థమైంది. "Mrinalini"లో 'నళిని' అనే పేరుంది. "రవీంద్రనాథ్ ఠాగూర్ భార్య పేరు "మృణాళినీదేవి". నాకు నింగి నెక్కినంత సంబరం.

టైమ్ అయిదయింది. అబ్బో! చాలా సేపే అయింది — అనుకుంటూ లేచి స్నానం చేసి తెల్లటి లాల్చీ పైజమాలోకి మారి డాబా మీదకు వెళ్లాను.

కాసేపటికి తను పైకొచ్చి ఆరిన బట్టలు మడతలేస్తున్నది. ఇప్పుడు పసుపురంగు ఓణీలో ముచ్చటగా వుంది. జుట్టంతా లాగి ముడి వేసుకున్నట్లుంది. గమ్మత్తుగా వుంది. ఇంకా స్నానం చేసినట్టు లేదు. అలసిపోయినట్టున్న మొహం చాలా నచ్చింది. నా కామెను ఏడిపించాలనిపించింది.

"హాయ్! ఓడిపోయావుగా! నిర్భాగ్యశ్రీ" — అన్నాను.

ఛుర్రుమన్నట్టు చూసింది.

"ఆహా! నిర్భాగ్యశ్రీ బాగుంది. ఇంతకీ ఆ పేరు పొందిన రచయిత ఎవరో కొంచెం సెలవిస్తారా?" ఉక్రోషంగా అడిగాననుకుందేమో!

కాసేపు ఆమెని అల్లరి చేయాలనిపించి, "నేనే!" అన్నాను.

"షటప్!" అనేసి విసురుగా వెళ్ళిపోయింది.

నా చేతిలో గులాబి నలిగిపోయింది. నా గుండెలో అలజడి.

* * *

నేను తన పేరు చెప్పేలోపే వెళ్ళిపోయిందేమిటే? ఛ! నేను అలా అనవలసింది కాదు. తిట్టుకుంటూ క్రిందికి వచ్చాను. ఆలోచిస్తున్న నా మీద కాగితం వచ్చి పడింది. అది విసిరేసిన నా ప్రేయసి ప్రక్కకి తప్పుకోవడం నా దృష్టిని దాటిపోలేదు. ఏముందందులో. నేనంటే ఇష్టమని వ్రాసిందా లేక తిడుతూ వ్రాసిందా? నరాల్ని తెంపేసే టెన్షన్. మెల్లిగా కాగితం విప్పి చదవసాగాను. తెల్లటి కాగితం మీద నీలి రంగు ముత్యాలను పేర్చినట్లుంది.

ప్రియాతి ప్రియమైన మీకు...

*మీకు తెలియని నా మనస్సుని ఇక్కడ పొందుపరుస్తున్నాను. పూర్తిగా చదవండి. "ప్రేమపావురాలు"తోనే నన్నెందుకో కదిలించారు. అనుకోకుండా నేను మీ ప్రక్కనొచ్చి వాలటం దేవుడు నా కిచ్చిన అరుదైన వరం. కాదా! మిమ్మల్ని ఒకటి కాదు రెండు కాదు దాదాపు అరవై రోజుల నుంచి గమనించాను. రోజూ వెలుతురులో వున్న నన్ను మీరు చీకట్లో కూర్చుని గమనించడం నాకు తెలుసు. నేను రోజూ చదువుకుంటాననుకుంటున్నారు కదూ! లేదండీ! అక్కడ కూర్చుని మీ సమక్షంలో వున్నట్లే ఊహలమాల అల్లుతాను. మీరు "గులాబీ"ని పట్టుకుని కూర్చోవడం కూడా నేను చూస్తూనే వున్నాను. మీ ఊహల్లో నేనెన్ని నిద్రలేని రాత్రులు గడిపానో...!*

*మీ ప్రేమని మీరు మాత్రమే తెలపాలని నా ఆరాటం. ఆ రోజు మీరా మాట చెప్పగానే మిమ్మల్నెందుకో ఏడిపించాలనిపించింది — మీలాగే! మీ మీద నా కేం ఆసక్తి లేదంటే మీకు రోషమొచ్చి మీ ధైర్యం నిరూపించుకుంటారని నా ఆశ. నేననుకున్నట్లే మీలో పౌరుషం ప్రవేశించి "పేరు కనుక్కుంటా" అని పందెం పెట్టారు. అదిగో... అలాంటి ఉత్సాహాన్నే నేను మీ నుంచి ఆశించేది. ఇంటికి వచ్చాక కూడా కావాలనే అలా మాట్లాడాను. మీ పట్టుదల ఇంకా పెరిగింది కదూ!*

*అవునూ... అంతసేపు కష్టపడ్డారేంటి! మిమ్మల్ని నేను కిటికీలో నుంచి గమనిస్తూనే వున్నాను. ఇంతకీ మీరు నా పేరు తప్పు చెప్పారేం! కనుక్కో లేదా! అయినా రేపటి వరకు టైముందిగా! అది సరే కానీ... అన్నీ అనేసి తప్పు చేసినట్టు ఫీలవడం దేనికట? మీరా ఫేస్‌తో ఎంత ముద్దొస్తున్నారో మీకు తెలుసా...?*

*సరే! ఇంకా సిగ్గెందుకు. నేనూ ప్రేమిస్తున్నాను. మిమ్మల్ని. మరి నా పేరేంటో కనుక్కోండి.*

సెలవు
మీ
.....

నా కిందులో "మీ" చాలా నచ్చింది. నా మనసంతా మధురంగా అయిపోయింది. తలుపు మీద సవ్వడికి అటు తిరిగి కళ్ళార్పటం మరిచిపోయాను. దివి నుంచి భూలోక విహారాని కొచ్చిన అప్సరసలా... ఎరుపురంగు చీరలో అపురూపంగా నడిచి వస్తుంటే... ఆమె పాదాల క్రింద నా చేతులుంచాలనిపించింది. కాటుక కళ్ళల్లో మెరుపులు... చెదరని చిరునవ్వు ... ఎరుపు రంగు గాజుల మీద సూర్యకిరణ మొకటి పడి విశ్లేషణ చెంది ఇంద్రధనుస్సులాగా కనిపించింది. నుదురు మీద అల్లుకున్న ముంగురులు అందంగా మెరుస్తున్నాయి. మందార మాల మధ్యలోని చేమంతి చెండులాగా వుంది. నా దగ్గరగా వచ్చి ఆగింది. చిన్నగా నవ్వి గులాబీ వంక చూసి "ఇప్పటికైనా గులాబీ ఇస్తారా? లేక... మీ చేతిలోనే నలిపేసుకుంటారా?" చిన్నగా అడిగింది. దోసెడు మల్లెలు నా మీద విసిరిన భావం. అర్థంకాని ఉద్వేగం. గుండె గొంతులో కొచ్చిన భావం. గులాబీరంగులో అందంగా ముద్దొస్తున్న అరచేతిని ముందుకు జరిపింది. గులాబీని ఆమె చేతిలో వుంచుతూనే వణుకుతున్న గొంతుతో "నిజంగా! ఐ లవ్యూ మృణాళినీ!" అన్నాను. నా గొంతు నాకే వింతగా వినిపించింది. ఆమె కళ్ళల్లో ఆశ్చర్యపు తెర. నా కళ్ళల్లో కన్నీటి తెర. సన్నటి వేళ్ళ మధ్య అమరిన గులాబీకి అందం ఎక్కువైంది.

"కరక్టే కదా! నీ పేరు స్పెల్లింగ్‌లో 'నళిని' వుంది. అంతేనా!"

చిన్నగా నవ్వింది. గులాబీ గమ్మత్తుగా గుండెని స్పృశించిన గమ్మత్తయిన అనుభూతి.

"కరక్ట్! మీరే గెలిచారు. మీ గెలుపుకి నా మనస్సుని కానుకగా అర్పిస్తాను. స్వీకరిస్తారా?" అంది తల దించుకుని.

"ఏయ్! అలాగంటావేంటి?" అన్నాను.

"మన పెళ్ళెప్పుడు? మా ఇంట్లో ఓ.కె. చేసుకున్నానప్పుడే. ఇకనుంచి దొంగతనంగా చూడక్కర లేదు. అన్నట్టు మీరీ రోజు చాలా ముద్దొస్తున్నారు" అని నా చెయ్యి మృదువుగా స్పృశించి చిరునవ్వు నా మొహాన పారేసి పారిపోయింది నా ప్రేయసి.

* * *

అన్నట్టు మరో రెండు నెలల్లో మా పెళ్ళి. తప్పకుండా రండి అందరూ. ఇప్పుడు చెప్పండి — ఇది ప్రేమేగా! కాదా! కాదనరు. నాకు తెలుసులెండి.

— కె. శ్రీధర్
ఇంటి నెం. 48-1-151,
చిపుకులవారి వీధి,
ఒంగోలు - 523 001